క్లుప్తంగా

రూ.8 లక్షలకు వినాయకుడి లడ్డూ వేలం



లడ్డూను స్వీకరిస్తున్న కాంట్రాక్టర్ జనార్దన్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వినాయకునికి నైవేద్యంగా ఉంచిన భారీ లడ్డూను ఏ వన్ కాంట్రాక్టర్ జనార్దన్‌రెడ్డి రూ.8 లక్షలకు వేలం పాట ద్వారా సొంతం చేసుకున్నారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత చేతుల మీదుగా ఆయన లడ్డూను స్వీకరించి భక్తులకు పంచిపెట్టారు.

పెరియర్ మార్గం అనుసరణీయం



మాట్లాడుతున్న కరవది సుబ్బారావు

తిరుపతి కల్చరల్: విప్లవవాది, మానవతావాది పెరియర్ మార్గం అనుసరణీయమని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు తెలిపారు. పెరియర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బి.నాగభూషణం అధ్యక్షతన పెరియర్ రామస్వామి నాయకర్ జయంతి సభ నిర్వహించారు. ఆర్‌పీఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు పి.అంజయ్య, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పి.గురప్ప, దళిత సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు జి.ధనశేఖర్, ఎస్సీ,ఎస్టీ సంఘ నేత కే.ప్రసాదరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ప్రజా నాట్య మండలి నేత పెంచయ్య, హేతువాది జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి పాల్గొన్నారు.

భాషపై భయాన్ని తొలగించాలి

పాకాల: విద్యార్థుల్లో భాష పట్ల భయాన్ని చిన్నతనం నుంచి తొలగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. గురువారం పోలిశెట్టిగారిపల్లి, దామలచెరువు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు వెంకటాచలం, శారద, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి గురజాడ



గురజాడకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పాకాల: తెలుగు సాహిత్యాన్ని సామాన్య మానవుడికి కూడా అర్థమయ్యేలా చాటిన మహోన్నత వ్యక్తి గురజాడ అప్పారావు అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురజాడ జయంతిని నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఈశ్వర్‌బాబు, అధ్యాపకులు డాక్టర్ రమేష్‌కుమార్, వినోద్ పాల్గొన్నారు.

రాగి వైరు చోరీ

తిరుపతి అర్బన్: తిరుపతి మత్స్యశాఖ జిల్లా కార్యాలయంలో రెండు విద్యుత్ మోటార్లు ఉన్నాయి. ఒక మోటార్ కార్యాలయ అవసరంతోపాటు చేపల పెంపకం తొట్లెలకు నీటిని నింపడానికి, మరో మోటార్ పూర్తిగా చేపల తొట్టెలకు నీరు నింపడానికి వినియోగిస్తున్నారు. అయితే బుధవారం రాత్రి రెండు మోటార్లకు చెందిన రాగి వైరును చోరీ చేశారు. దీంతో గురువారం మోటార్లు పనిచేయలేదు. మత్స్యశాఖ అధికారులు కొత్త వైరును ఏర్పాటు చేసి మోటార్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాసనాయక్ పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న పీడీ జ్యోతి

రామచంద్రాపురం: ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్య లభిస్తుందని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఒక్కరోజు ప్రాథమిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు డీపీఎం పట్టాభిరెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రరెడ్డి, ఏసీ దినేష్‌కుమార్, ఏపీఎం రాధమ్మ పాల్గొన్నారు.

27న ధర్నాను జయప్రదం చేయండి

తిరుపతి కల్చరల్: ప్రజలకు పెనుభారంగా మారిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. గురువారం గంధమనేని శివయ్య భవన్‌లో వామపక్ష నేతల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పి.మురళి, వందవాసి నాగరాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

తిరుమల: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం ఉదయం కల్పవృక్ష వాహనసేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ఆవిష్కరించారు. ఇందులో రచించిన భావనారాయణాచార్యులు 'విమా నార్చన కల్పం', మల్లాది సూరిబాబు రచించిన 'అన్నమయ్య సంకీర్తనా కౌముది', ఆర్‌వీ కమలకణ్ణన్ రచించిన 'రామనాటక కీర్తనై' (తమిళం) ఉన్నాయి. ఇందులో ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జేఈఓ సదాభార్గవి, సీవీఎస్వో నరసింహకిషోర్, ఎస్ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణశర్మ, ఉపసంపాదకులు నరసింహాచార్య పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దంపతులు, ఈవో ఏవీ ధర్మారెడ్డి, పాలకమండలి సభ్యులు





వాహన సేవలో గజరాజుతో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి



కల్పవృక్ష వాహనసేవలో కళాబృందాల ప్రదర్శన



ఆలయ మాడవీధుల్లో మజ్జిగ పంపిణీ చేస్తున్న అన్నమయ్య వంశీకులు

బ్రహ్మాండం.. బ్రహ్మోత్సవం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నాల్గవ రోజు గురువారం ఉదయం మలయప్పస్వామి కల్పవృక్ష వాహనంపై రాజమన్నార్ అలంకారంలో, రాత్రి సర్వభూపాలునిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వాహనాల ముందు భక్తజన బృందాలు, భజనలు, కోలాటాల నడుమ వాహనసేవలు కోలాహలంగా జరిగాయి.



వాహన సేవలో తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి దంపతులు

గరుడోత్సవానికి ఆర్టీసీ సిద్ధం

- బ్రహ్మోత్సవాల్లోనూ సాధారణ చార్జీలే
- రాను పోను టికెట్లకు రూ.20 తగ్గింపు

తిరుపతి అర్బన్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆర్టీసీ భాగస్వామ్యం కీలకం. శ్రీవారి దర్శనం కోసం వచ్చే లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా రవాణా సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఈ క్రమంలో ఆర్టీసీ సర్వం సిద్ధం చేసింది. బ్రహ్మోత్సవాల సమయంలో చార్జీలకు సంబంధించి టికెట్ ధరలు పెంచుకునే వెసులుబాటు ఉంది. అయితే భక్తులను దృష్టిలో ఉంచుకుని సాధారణ చార్జీలతో ప్రత్యేక సర్వీసులను నడపాలని భావించారు. సాధారణ సర్వీసుల్లో పెద్దలకు టికెట్ ధర రూ.90, పిల్లలకు రూ.70, విద్యుత్ ఏసీ సర్వీసుల్లో పెద్దలకు రూ.110, పిల్లలకు రూ.90 చార్జీ ఉంది. అదే ధరతో భక్తులకు ఆర్టీసీ సర్వీసులను నడపనున్నారు. తిరుపతి నుంచి తిరుమల కొండకు వెళ్లే భక్తులు రాను, పోను టికెట్లు ఒకేసారి తీసుకుంటే రూ.20 తగ్గుతుంది.

గరుడోత్సవానికి ఆర్టీసీ సర్వీసులు ఇలా...

గరుడోత్సవం సందర్భంగా ఉదయం నుంచి తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని ఏడుకొండలస్వామి బస్టాండ్, రైల్వేస్టేషన్, అలిపిరి బాలాజీ బస్టాండ్ నుంచి తిరుమలకు సర్వీసులను ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం రాత్రి 7గంటల తర్వాత అలిపిరి బాలాజీ బస్టాండ్ నుంచి మాత్రమే తిరుమలకు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక సర్వీసులు...

గరుడోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. సాధారణంగా 220 సర్వీసులు రోజూ 1,400 ట్రిప్పులు నడుపుతుంటారు. అయితే గరుడోత్సవం నేపథ్యంలో 340 సర్వీసులు 2,700 ట్రిప్పులు నడపనున్నారు.

గరుడోత్సవానికి ప్రత్యేక ఉద్యోగులు...

గరుడోత్సవానికి అవసరం అయిన ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేయడంతోపాటు వాటి పర్యవేక్షణ బాధ్యతను కడప ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావుకు అప్పగించారు. ఆయనతోపాటు తిరుపతి జిల్లా డీపీటీఓ చెంగల్‌రెడ్డి, చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాల డీపీటీఓలు కూడా విధులు నిర్వహించనున్నారు.

పెరటాసి శనివారానికి ప్రత్యేక బస్సులు...

ఈనెల 23వ తేదీ పెరటాసి శనివారం కావడంతో గరుడోత్సవం రోజు ఏర్పాటు చేస్తున్న ఆర్టీసీ సర్వీసులను యథావిధిగా కొనసాగించనున్నారు. పెరటాసి శనివారాలను పురస్కరించుకుని పెద్ద ఎత్తున ఆర్టీసీ సర్వీసులను తిరుమలకు ఏర్పాటు చేయనున్నారు.



సమర్థవంతంగా సర్వీసులు నడుపుతాం...

శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గరుడోత్సవం పురస్కరించుకుని శుక్రవారం సమర్థవంతంగా ఆర్టీసీ సర్వీసులు నడుపుతాం. ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేశాం. అనుభవం కల్గిన డ్రైవర్లను ఏర్పాటు చేస్తున్నాం. శుక్రవారం, పెరటాసి శనివారం సందర్భంగా అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తాం. భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.
–తిమ్మాడి చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజారవాణా అధికారి

శ్రీవారికి కళాకారుల నృత్య కళానీరాజనం



రామచంద్ర పుష్కరిణిలో..



అన్నమాచార్య కళామందిరంలో..

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక తిరుపతిలోని వివిధ కళా వేదికలపై గురువారం రాత్రి కళాకారులు తమదైన శైలిలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నృత్యాభినయ ప్రదర్శనతో శ్రీవారికి ఘన నీరాజనాలు అందించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక తిరుపతిలోని మహతి, అన్నమాచార్య కళామందిరం, శ్రీరామచంద్రపుష్కరిణి వేదికలపై సంగీత, నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నమాచార్య కళామందిరంలో ఎస్వీ సంగీత కళాశాల కూచిపూడి విభాగం డాక్టర్ ఉషారాణి సారథ్యంలో, మహతి కళాక్షేత్రంలో కారైకల్‌కు చెందిన నాట్యాలయం కళా బృందం ప్రదర్శించిన భరతనాట్య నృత్యాభినయం అబ్బుర పరిచింది. ఇదే రోజు శ్రీరామచంద్ర పుష్కరిణి వేదికపై ఎస్.శివప్రసాద్ కళా బృందం ప్రదర్శించిన నృత్యాలు కనువిందు చేశాయి.



మహతి కళాక్షేత్రంలో..

తుమ్మలగుంటలో అన్నదానం



అన్నదానం చేస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, దొడ్ల కరుణాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్ : తుమ్మలగుంటలోని శ్రీ ప్రసన్నాంజనేయ ఆలయ వద్ద ఏర్పాటు చేసిన వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ధర్మకర్త దొడ్ల కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినాయకచవితి వారోత్సవాల్లో భాగంగా ఏటా తుమ్మలగుంటలో అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు ధర్మకర్త కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ధనుంజయరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, లోకేష్ నాయుడు, తేజ, నితీష్, హరి, చరణ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై ఆమోదం

- తిరుపతి ఓటర్ నమోదు అధికారి హరిత

తిరుపతి తుడా: నగరంలో పోలింగ్ కేంద్రాలపై అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను సేకరించి ఆమోదిస్తూ తీర్మానం చేశామని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జాతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం హరిత ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో 1,400 ఓటర్లు దాటిన కేంద్రాల్లోని ఓటర్లను మరో కేంద్రంగా చేయాలనే నిర్ణయాన్ని, నేడు జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయం మేరకు 1,500 ఓటర్లు దాటిన కేంద్రాలను పరిగణలోకి తీసుకుని విభజించాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. తిరుపతిలోని 213వ పోలింగ్ కేంద్రంలో 1,533 మంది ఓటర్లు వున్నారని, అదేవిధంగా 234వ కేంద్రంలో 1,510 మంది ఓటర్లు ఉండడంతో ఆ రెండు కేంద్రాలను నాలుగుగా పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి అన్ని పార్టీల ప్రతినిధులు ఆమోదం తెలిపారని ఆమె అన్నారు. జాతీయ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తిరుపతి నియోజకవర్గం ఓటర్ల నమోదు అదనపు అధికారి డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, డీటీ జీవన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

నిమజ్జన ఏర్పాట్లు అద్వితీయం



మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

- సహకరించిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు
- వినాయక ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్

తిరుపతి కల్చరల్: సామూహిక వినాయక నిమజ్జన మహోత్సవం ప్రశాంతంగా, నిర్విఘ్నంగా పూర్తిచేసుకోవడానికి అద్వితీయంగా ఏర్పాట్లు చేపట్టడడం అభినందనీయమని, ఇందుకు సహకరించిన అందరికీ వినాయక ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వినాయక ఉత్సవ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయకచవితి తర్వాత మూడో రోజు బుధవారం సామూహిక వినాయక నిమజ్జన మహోత్సవం చేపట్టారన్నారు. సామూహిక నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లకు టీటీడీ చైర్మన్ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, ఇంజినీరింగ్, హెల్త్ సిబ్బంది, జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు, సిబ్బంది, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే మండప నిర్వాహకులకు, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మిగిలిన విగ్రహాలు 7వ రోజు, 11వ రోజు నిమజ్జనం ప్రశాంతంగా పూర్తిచేసుకోవడానికి ఇదే రకమైన సహకారం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎస్‌వీఎం.వెంకటేష్, భానుప్రకాష్‌రెడ్డి, నవీన్‌కుమార్, గుండాల గోపినాథ్ రెడ్డి, చెంగారెడ్డి, వాసు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నానో టెక్నాలజీపై అవగాహన



విజయమోహనన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

రామచంద్రాపురం: ఫార్మసీ విద్యార్థులకు నానో టెక్నాలజీపై అవగాహన అవసరమని తిరుపతి ఐసర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్) ప్రొఫెసర్లు విజయ మోహనన్ పిళ్లై, రవిశంకర్ అన్నారు. గురువారం వెంకట్రామాపురం సమీపంలో గల సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో అనంతపురం జేఎన్‌టీయూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్సెస్, ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ ఫార్మా స్యూటికల్ నానో టెక్నాలజీ రీసెర్చ్ టు రెవెన్యూ అనే అంశంపై ఫార్మసీ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత పాల్గొన్నారు.